క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



కుసుమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండలంలోని నందిగాం, నందబలగ, కుసుమూరు గ్రామాల్లో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మండల విద్యా శాఖాధికారి జె.త్రినాథరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాలకు సంబంధించిన వివిధ రికార్డులు, జగనన్న గోరుముద్ద పథకం, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

చురుగ్గా పెన్షన్ల పంపిణీ



తెర్లాంలో వృద్ధురాలికి పెన్షన్ డబ్బులు ఇచ్చేందుకు బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ వి.గౌరీశ్వరి

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ సామాజిక పెన్షన్ పథకం కింద పింఛన్ల పంపిణీ చురుగ్గా జరుగుతోంది. పెన్షన్ల పంపిణీ మండలంలో మూడో రోజు కూడా కొనసాగింది. మండలంలో 9,741 మంది పెన్షన్‌దారులుండగా.. గురువారం నాటికి 95 శాతం పంపిణీ జరిగింది.

ప్రకృతి వ్యవసాయం మేలు

తెర్లాం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం విభాగం రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ అన్నారు. మండలంలోని పూనువలస క్లస్టర్ పరిధిలోని పెదపాలవలస గ్రామంలో రైతులు సాగుచేస్తున్న నవధాన్యాలను మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవధాన్యాలు వేసి ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూమి సారవంతంగా మారి అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ఆర్నేపల్లి సింహాద్రినాయుడు, భాగ్యం, రమ, తదితరులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజనాలు..

బాడంగి: ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలున్నాయని ఆ విభావం రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందరరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న బాడంగికి చెందిన కె. కృష్ణమూర్తి పొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులకు స్వస్తి పలికి, సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల భూసారం పెరగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ శిరీష, వీఏఏ.జయలక్ష్మి, జి.సన్యాసినాయుడు, ఎల్‌ఐలు ఈశ్వరరావు, సూర్యలక్ష్మి, ఐసీఆర్‌పీలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

శ్రీవరితోనే అధిక దిగుబడులు

బొబ్బిలి: వరి సాగును శ్రీవరి పద్ధతిలో చేయడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.శ్యామ్ సుందరరావు అన్నారు. మండలంలోని మెట్టవలసలో శ్రీ వరి సాగుపై స్థానిక రైతు విశ్వనాథ్ పొలంలో గురువారం మోడల్ డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీవరి సాగు వల్ల చీడపీడల నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. అలాగే గొర్లె సీతారామ పురంలో బీజామృతంతో నారుశుద్ధి చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆర్‌టీఓ హేమసుందర్, వీఏఏ రాజశేఖర్, ఎస్‌డీఏ వాండ్రాసి లక్ష్మి, జి. వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నేరం

బొబ్బిలి: గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని ఆర్డీఓ పి. శేషశైలజ అన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మూఢ నమ్మకాల వల్ల గర్భస్రావాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. అలాగే లింగ నిర్ధారణ వల్ల కూడా గర్భస్రావాలకు పాల్పడుతున్నారన్నారు. లింగ నిర్ధారణ జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి జి. సంతోషికుమారి, ఎన్‌జీఓ శాంతి, వి. చిన్నతల్లి, చాముండేశ్వరి, పవన్, ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామభద్రపురం: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆరికతోట గ్రామానికి చెందిన సురగాల రామినాయుడు (35) రోజూ మద్యం తాగుతూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసేవాడు. ఈ క్రమంలో భార్యతో ఎప్పటికప్పుడు గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో జూలై 30న భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన రామినాయుడు గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి, బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాల పండగ

● ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి: సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే శంబంగి వెంటక చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ముత్తాయవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి వారికి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో పేదలు, మధ్యతరగతి ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని వారికి ఉపయోగపడేవిధంగా సంక్షేమ పథకాలను రూపొందించారని చెప్పారు. ఎన్నికల ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉన్న పథకాలనే కాకుండా మేనిఫెస్టోలో లేని పథకాలు, కార్యక్రమాలను కూడా అమలు చేసి 98 శాతం హామీలను అమలు చేసిన మనసున్న మారాజు జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పథకాలు మంజూరు కావడంలో ఇంకేమైనా సమస్యలున్నాయా అని ఎమ్మెల్యే అడగగా.. ప్రజలు ఏం ఇబ్బందుల్లేవని చెప్పడంతో అందరూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, ఎంపీడీఓ పి. రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోధరరావు, సర్పంచ్ పిల్లా వసుంధర, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డల సత్యనారాయణ, వలంటీర్లు, సచివాలయ, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే కంబాల

రేగిడి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని దేవుదళ పంచాయతీ, గోపింపేట గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు నిర్విరామంగా పథకాలు అందిస్తోందన్నారు. ప్రతీ ఇంటికి ఏడాదికి సగటున రూ.1 లక్షకు మించి ప్రభుత్వ సాయం సంక్షేమం రూపంలో అందిస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవీ అమలుచేయలేదన్నారు. ఏవైనా పథకాలు వారు ఇస్తే వారి పార్టీ వారికే ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అమలుచేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని నమ్మి ఓట్లు వేస్తే, భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ కుప్పిలి దుర్గమ్మ, రాష్ట్ర పోలేటి వెలమ డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ప్రజా ప్రయోజనాలే వైఎస్సార్‌సీపీ అజెండా..

● ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ప్రజా ప్రయోజనాలే వైఎస్సార్‌సీపీ అజెండా అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు అదనంగా సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టి ప్రజలకు మేలు చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారని చెప్పారు. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎంతోమందికి విలువైన ధ్రువ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 90,958 కుటుంబాలుండగా 74వేల పైచిలుకు కుటుంబాలను సర్వే చేయించామన్నారు. ఇందులో 48,414 కుటుంబాలకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేసినట్లు తెలిపారు. గతంలో ఇవే ధ్రువపత్రాలు కావాలంటే తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. దీనికి డబ్బులు ఖర్చయ్యేవని.. ప్రస్తుతం పైసా ఖర్చు లేకుండా ధ్రువ పత్రాలు అందజేసినట్లు చెప్పారు. ఇంత మంచి ఆలోచన చేసిన ముఖ్యమంత్రికి... కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బంది, వలంటీర్లకు ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంల మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, కౌన్సిలర్ పాలవలస ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

● ఎమ్మెల్యే కంబాల జోగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: ఉద్యానవన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని శివ్వాం గ్రామంలో జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రేగిడి మండలం, లింగాలవలస శ్రీనివాసా పామాయిల్ మిల్ ఏర్పాటు చేసిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, కాసేపు మాట్లాడారు. పామాయిల్ సాగుచేసే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ప్రభుత్వ రాయితీలు వర్తింపజేస్తామన్నారు. యంత్రపరికరాలు సమకూర్చి, పామాయిల్ సాగు, పంటకోత వంటివి చేపడతామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా గుర్తింపు పొందారని, రైతు సంక్షేమం కోసం ఆయన ప్రతీ పల్లెలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచుతున్నారన్నారు. అన్నదాత పండించిన ప్రతీ పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. అంతకుముందు పెద్దఎత్తున పామాయిల్ సాగు చేపట్టిన పార్వతీపురం మన్యం జిల్లా, గరుగుబిల్లి మండలం, కొత్తూరుకు చెందిన ద్వారపురెడ్డి ధనుంజయనాయుడు, వంగర మండలానికి చెందిన రైతులు ఆలుబిల్లి సుదర్శనరావు, గేదెల రామకృష్ణ, బొక్కెల సత్యంనాయుడులు పంటల సాగులో తమ అనుభవాలు, సమస్యలను వివరించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పలు పామాయిల్ మొక్కలను ఎమ్మెల్యే నాటారు. శ్రీనివాస పామాయిల్ సీఈఓ పి.మందీప్ కృష్ణ మాట్లాడుతూ థాయ్‌లాండ్ దేశం నుంచి పామాయిల్ క్లోనల్ వెరైటీ మొక్కలు దిగుమతి చేసి, పెంపకం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, ఉద్యాన శాఖ ఏడీ శైలజ, రాజాం ఉద్యాన శాఖాధికారి సీహెచ్ ఉమామహేశ్వరి, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యానవన రైతులకు ప్రోత్సాహం

● ఎమ్మెల్యే శంబంగి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఉద్యాన పంటలు సాగుచేసే రైతులను వివిధ రకాల రాయితీలతో ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని నారశింహునిపేటలో ఉద్యాన రైతులకు మెగా ఆయిల్‌పాం ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో 985 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగవుతోందన్నారు. హెక్టార్ విస్తీర్ణానికి సరిపోయే దేశవాళీ మొక్కలకు రూ.20 వేలు, ఎగుమతి రకాలకు రూ.29 వేలను సబ్సిడీగా అందజేస్తున్నట్టు చెప్పారు. అలాగే తోటల నిర్వహణ, అంతర పంటల సాగుకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి వేణుగోపాలనాయుడు, ఉద్యాన శాఖాధికారులు ఎస్. వెంకటరత్నం, మోహనకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల తనిఖీ



రశీదులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: ప్రజాపంపిణీ, మధ్యాహ్న భోజన పథకాలకు బియ్యం పంపిణీ చేసే వాహనాల పనితీరును తహసీల్దార్ డోల రాజేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. మల్లంపేటలోని ఎండీయూ వాహనం బియ్యం పంపిణీ చేస్తుండగా రశీదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట వీఆర్‌ఓ శ్రీనివాసరావు ఉన్నారు. అలాగే మున్సిపాలిటీలోని 36వ పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఏపీఎంగా శ్రీనివాసరావు

బొబ్బిలి: మండల వెలుగు ఏపీఎంగా పి. శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి. రవికుమార్ ఆయన్ను అభినందించారు. డ్వాక్రా స్వయం సహాయక సంఘాలకు మెరుగైన సేవలందించాలని ఈ సందర్భంగా కోరారు.

యువకుడి ఆత్మహత్య

బొబ్బిలి: మండలంలోని శివడవలసకు చెందిన రాయిపల్లి సాయి (21)అనే యువకుడు మానసిక ఆందోళనతో ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై పి. జ్ఞానప్రసాద్ తెలిపారు. గురువారం విశాఖ వెళ్తానని సాయి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారంతా ఎవరి విధులకు వారు వెళ్లిపోయారు. దీంతో సాయి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. తండ్రి వెంకటనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష'కు విశేష స్పందన

రేగిడి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నెల రోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండల పరిధిలోని గోపెంపేట గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన అర్హులకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జూలై 1 నుంచి 31వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి సర్వీసు ఫీజు లేకుండా అందించారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చంనాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, ఖండ్యాం ఎంపీటీసీ కింజరాపు సురేష్, లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే కంబాల జోగులు



రైతులకు ఎరువులు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని శివ్వాం గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా, డీఏపీ ఎరువులను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలోని టీడీపీ రైతు సమస్యలను గాలికి వదిలేసిందని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికైన తర్వాత రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, రాయితీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్రపరికరాలు సమకూరుస్తున్నారన్నారు. ఇదే కాకుండా అన్ని రకాల పంటల కొనుగోళ్ల ప్రక్రియ కూడా ఆర్‌బీకేల వద్దనే జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోండి..

బాడంగి: పర్యవేక్షణ లేకుండా ఉపాధి పనులు చేపట్టి వేతనదారుల మరణానికి కారకులైన ఉపాధి అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు ఎ. సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయులను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పూడివలస గ్రామంలో ఉపాధి పనికి వెళ్లిన అప్పలనాయుడు, రామమూర్తి విద్యుత్ తీగలకు ఆనుకొని వేలాడిన జీఐ వైర్‌కు తగిలి మృతి చెందారన్నారు. వర్షాకాలంలో పనులు చేయించడం వల్లే మరణాలు సంభవించాయని, అందుకు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాలు వేగవంతం

తెర్లాం: చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో స్థలాలు లేక ఇంతవరకు నిర్మించని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలకు సంబంధించి రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. అలాగే ఈ నెల 9 నుంచి 15 వరకు అన్ని గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఆయనతోపాటు ఈఓపీఆర్‌డీ రాంబాబు ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి టీహెచ్‌ఆర్ కిట్లు అందజేత

వంగర: మండలంలోని మద్దువలస అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.మీనాకుమారి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్) ప్రభుత్వం సరఫరా చేస్తోంది. గ్రామానికి చెందిన గర్భిణులు డబ్బాడ చంద్రకళ, బోర కల్యాణి డెలివరీ(ప్రసవం)కి రాజాం జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో ఉన్నారు. అయితే వారి వద్దకు గురువారం వెళ్లి, ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్.ఆర్.ఎస్) యాప్‌లో వారి పేర్లు నమోదు చేసి, టీహెచ్‌ఆర్ కిట్లను అందజేశారు. దీంతో ఆయా గర్భిణుల కుటుంబ సభ్యులు ప్రభుత్వంతో పాటు ఆమెను అభినందించారు.

రేగిడి, సంకిలి సొసైటీలకు చైర్మన్ల నియామకం

రేగిడి: మండలంలోని రేగిడి, సంకిలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు(సొసైటీలు)కు నూతనంగా చైర్మన్ల నియామకం చేపట్టినట్లు రేగిడి సొసైటీ అసిస్టెంట్ సీఈఓ ఆగూరు కామేశ్వరరావు, సంకిలి సొసైటీకి చెందిన అసిస్టెంట్ సీఈఓ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రేగిడి సొసైటీకి కందిశ గ్రామానికి చెందిన వంజరాపు అశోక్‌కుమార్ చైర్మన్‌గా, సభ్యులుగా వప్పంగికి చెందిన గంటా మోహనరావు, వావిలవలస గ్రామానికి చెందిన మొయిద శ్రీనివాసరావు ఎంపికయ్యారు. సంకిలి సొసైటీకి సంబంధించి, చైర్మన్‌గా అంబఖండి మాజీ సర్పంచ్ లావేటి వెంకటవేణుగోపాలనాయుడు, సభ్యులుగా అప్పాపురానికి చెందిన కొమ్ము దుర్గారావు, తాటిపాడుకు చెందిన బేత శ్రీరాములు నియమితులయ్యారు.

చిత్తశుద్ధితో సేవలందించండి



నియామకపత్రాలు అందజేస్తున్న చైర్మన్ మురళీకృష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జ్



రామభద్రపురం: వలంటీర్‌కు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

బొబ్బిలి: సచివాలయాల పరిధిలోని ప్రజలకు చిత్తశుద్ధితో సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణ అన్నారు. పలు వార్డులకు ఎంపికైన వలంటీర్లకు గురువారం నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లే కీలకం

రామభద్రపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందజేయడంలో వలంటీర్లే కీలకమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. కొత్తగా వలంటీర్లుగా ఎంపికైన వారికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి ఆశయసాధనకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి, వైస్ ఎంపీపీ పెంకి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఇంటి వద్దే పౌష్టికాహారం

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఇంటివద్దే పౌష్టికాహారం అందించనున్నట్లు స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ జి. చిన్మయిదేవి అన్నారు. మండలంలోని బూసాయవలస అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గురువారం ఇంటింటికీ రేషన్ పంపిణీ చేశారు. అలాగే తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓలు కె. రాజ్యలక్ష్మి, జె.విజయలక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను సందర్శించిన ప్రత్యేక కార్యదర్శి

బొబ్బిలి: పట్టణంలోని జగనన్న కాలనీలను, ఇళ్ల నిర్మాణాన్ని గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంకే దివాన్ గురువారం సాయంత్రం పరిశీలించారు. రామందొరవలస, ఐటీఐ కాలనీల వద్ద ఉన్న జగనన్న కాలనీలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఏమేం అవసరాలున్నాయి? ఇళ్ల నిర్మాణంలో అధికారులు, సిబ్బంది సహకరిస్తున్నారా లేదానన్న వివరాలను నేరుగా లబ్ధిదారులను అడిగారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు హౌసింగ్ పీడీ వి. శ్రీనివాసరావు, డీఈఈలు పి.అప్పయ్య, ఎంజే రత్నాకర్, ఏఈ అల్లు సూర్యనారాయణ, మున్సిపల్ డీఈ రవికుమార్, ఆర్ఐ కల్యాణచక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

బాడంగి: మండలంలోని ఆకులకట్ట పంచాయతీ దత్తి వెంకయ్యపేట పరిధిలో మెయిన్‌రోడ్డు పక్కనున్న పెట్రోల్‌బంకును తహసీల్దార్ అజూరఫీ జాన్, సీఎస్ డీటీ స్వర్ణలత, హెచ్‌డీటీ చిన్నంనాయుడు, తదితరులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బంక్ లైసెన్స్, కొలత ప్రకారం పెట్రోల్ వేస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు.

పక్కాగా ఓటర్ సర్వే

రాజాం సిటీ: ఓటర్ల సర్వేను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ ఎస్.కె.రాజు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్ఓలతో సమావేశమైన ఆయన ప్రతీ ఓటరుకు సంబంధించి, ఇంటి నెంబర్‌ను తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో ఎన్నికల డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి, మందరాడ, మిర్తివలస, సిరిపురం గ్రామాల్లో చేపట్టిన ఓటరు సర్వేను పరిశీలించిన తహసీల్దార్ ఎ.సులోచనారాణి ఓటర్ల సర్వేకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

జగన్నాథవలసలో 'పొలంబడి'

వంగర: గ్రామీణ ప్రాంత రైతులంతా శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఏఓ తట్టికోట కన్నబాబు ఆకాంక్షించారు. మండలంలోని జగన్నాథవలస గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్షల ద్వారా నేల స్వభావాన్ని గుర్తించి, పంటలు సాగుచేయాలని సూచించారు. అలాగే వరిసాగులో మెలకువల పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. నారు వేసే ముందు నారు కొనలు తొలగించాలని, కాలిబాటలు ఉండేలా వరినాట్లు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మజ పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో మందులు

రాజాం సిటీ: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాడి పశువులు రోగాలు బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పశుసంవర్ధక శాఖ ఏడీ బొత్స జయప్రకాష్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయం వద్ద రైతు భరోసా కేంద్రాల్లోని పశుసంవర్ధక సహాయకులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆర్‌బీకేకు రూ.33 వేలు విలువైన మందులను అందజేశామని, పశువులకు అత్యవసరమైన మందులు సైతం అందుబాటులో ఉన్నాయని, పాడిరైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రక్తహీనత నివారణే ప్రభుత్వ లక్ష్యం

● వైద్యాధికారి దిలీప్‌కుమార్



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

రామభద్రపురం: రక్తహీనత నివారణే ప్రభుత్వం లక్ష్యమని వైద్యాధికారి దిలీప్‌కుమార్ అన్నారు. ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గురువారం క్రమంతప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి సత్వర చికిత్సను అందిస్తామని తెలిపారు. ప్రధానంగా ఆడపిల్లల్లో రక్తహీనత తలెత్తకుండా ప్రభుత్వం జాగ్రత్త చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య, హెచ్ఎం కె. కామేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.